క్లుప్తంగా

నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

హిరమండలం: ఎల్‌.ఎన్‌.పేట ఔట్‌ పోస్టు పోలీస్‌ స్టేషన్‌ పనులను వేగవంతం చేయాలని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఆదేశించారు. ఎల్‌.ఎన్‌.పేట మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో నిర్మిస్తున్న ఔట్‌ పోస్టు పనులను గురువారం పరిశీలించారు. పలుచోట్ల పనుల్లో చేర్పులు, మార్పులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి ఉన్నారు.

సీఆర్‌పీఎస్‌ రాష్ట్ర డైరెక్టర్‌గా ప్రత్తిపాటి



ప్రత్తిపాటి ప్రసాదరావు

సరుబుజ్జిలి: క్రిస్టియన్‌ రైట్‌ ప్రొటెక్షన్‌ సమితి (సీఆర్‌పీఎస్‌) రాష్ట్ర డైరెక్టర్‌గా మండలంలోని నందికొండ కాలనీకి చెందిన జిల్లా క్రైస్తవ మ్యారేజ్‌ రిజిస్ట్రార్‌ ప్రత్తిపాటి ప్రసాదరావు ఎంపికయ్యారు. ఈ మేరకు సీఆర్‌పీఎస్‌ జాతీయ చైర్మన్‌ డాక్టర్‌ ఆమోస్‌ జేమ్స్‌ చేతులు మీదుగా గురువారం ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉత్తర్వులు అందుకున్నారు. క్రైస్తవ హక్కుల సాధనలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావుకు పలు క్రిస్టియన్‌ సంఘాల ప్రతినిధులు, ఆరాధకులు అభినందనలు తెలిపారు.

ఎరువులు పక్కదారి పట్టాయి

- వ్యవసాయశాఖ అధికారిపై సభ్యుల ధ్వజం



ఏఓను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

హిరమండలం: ఎల్‌.ఎన్‌.పేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎరువుల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఏఓ కె.సింహాచలంను పలువురు సభ్యులు నిలదీశారు. ఇప్పటివరకు గ్రామాల వారీగా ఎంతమంది రైతులకు, ఎంతెంత ఎరువులు పంపిణీ చేశారో జాబితా అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, దీనిపై ప్రశ్నిస్తే సాకులు చెబుతున్నారని ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లారు. జల్‌ జీవన్‌ మిషన్‌ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి చుక్కనీరు రావడంలేదని, కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయని చింతలబడవంజ సర్పంచ్‌ సత్యనారాయణ ఆరోపించారు. మండలంలో జరిగిన జల్‌ జీవన్‌ పనులకు సంబంధించి ఆర్టీఐ యాక్ట్‌ ద్వారా నివేదిక తీసుకున్నామని, అందులో చాలా అక్రమాలు జరిగాయని, వీటిపై ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ రాజేశ్వరిని నిలదీశారు. వివిధ శాఖల పురోగతిపై సమీక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రెడ్డి రామారావు, తహసీల్దార్‌ ఈశ్వరమ్మ, డీటీ నీలిమ, ఐసీడీఎస్‌ పీఓ ఉమాజానకి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు అడ్డాగా..!



పాఠశాల ఆవరణంలో మందు సీసాలు

హిరమండలం: మండలంలోని సుభలయ ఆర్‌ అండ్‌ఆర్‌ కాలనీ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి మందుబాబులు అసాంఘిక చర్యలకు పాల్పడ్డారు. గురువారం ఉదయం పాఠశాల గేట్లు తెరిచేసరికి మద్యం సీసాలు ఉండటాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తించారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం అందించారు. పాఠశాల పరిసరాలను ఏఎస్‌ఐ చంద్రరావు పరిశీలించారు. గుడి, బడుల ఆవరణల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీనిపై నిఘా ఉంచతామని, అసాంఘిక చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు నిల్వ



జుబ్లీహిల్స్‌ రోడ్డు మధ్యలో నిల్వ ఉన్న మురుగునీటిని చూపిస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: మేజర్‌ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు, వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉంటుందని, పారిశుద్ధ్యం పనులు చేయకపోవడంతో వ్యర్థాలు ఉండిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పాతపట్నం జుబ్లీహిల్స్‌ రోడ్డులో గల ఆస్పత్రి సమీపంలో మురుగునీటి నిల్వను పరిశీలించారు. శాంతినగర్‌ వీధి మధ్యలో కూడా మురుగునీరు నిల్వ ఉంటుందన్నారు. ఇప్పటికైనా సర్పంచ్‌, ఈఓ స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

కలుషిత నీరే దిక్కు..!


- రక్షిత పథకాలు సురక్షితమేనా?
- జాడలేని నీటి నాణ్యతా తనిఖీలు
- తరచూ వ్యాపిస్తున్న అంటువ్యాధులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



సక్రమంగా పనిచేయని బుడ్డివలస రక్షిత పథకం



శిథిలమైన చినవెంకటాపురం రక్షిత పథకం



నిర్వహణ సక్రమంగాలేని ఆమదాలవలస మండలంలోని రామచంద్రాపురం రక్షిత పథకం

సరుబుజ్జిలి: గతకొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అనేకచోట్ల నుంచి నీరు ప్రవహించడంతో బోర్లు, రక్షిత మంచినీటి పథకాలు కూడా కలుషితమయ్యే ప్రమాదాలు అధికంగా ఉన్నాయి. దీనిపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలన ప్రజలు తరచూ అంటువ్యాధుల బారినపడుతున్నారు.

పర్యవేక్షణ లేదు..

నెలల తరబడి అధికారులు రక్షిత మంచినీటి పథకాలు, బోర్ల విషయంలో నిర్వహణ చేయడంలేదు. దీంతో నీటి పథకాల నుంచి వస్తున్న తాగునీటిలో నాణ్యత లోపిస్తోంది. మంచినీటి పథకం నుంచి వచ్చే పైపులైన్లు అధికంగా లీకేజీలు ఏర్పడుతున్నాయి. సరుబుజ్జిలి మండలం బుడ్డివలసలో పైపులైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చినవెంకటాపురం రక్షిత పథకం పూర్తిగా పాడైంది. చేతిపంపుల పరికరాలు కూడా తుప్పుపట్టాయి. దీనివలన బోరు అడుగు భాగాలకు మురుగునీరు వెళ్లి తాగునీరు కలుషితమవుతోంది. మిగిలిన మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

ఆమదాలవలస నియోజకవర్గంలోని సాగునీటి వనరుల వివరాలు ఇలా..			
మండలం	పంచాయతీలు	చేతిపంపులు	రక్షిత పథకాలు
సరుబుజ్జిలి	21	246	26
బూర్జ	30	350	47
ఆమదాలవలస	30	306	42
పొందూరు	29	433	43

తనిఖీలు శూన్యం...



పిచ్చిమొక్కల మధ్య ఆమదాలవలస మండలంలోని పొన్నాంపేట రక్షిత పథకం

ప్రభుత్వం అందస్తున్న ఫీల్డ్‌ టెస్టింగ్‌ కిట్లు ద్వారా గ్రామాల్లో రక్షిత పథకాలు, బోర్లు ప్రతీ ఆరు నెలలకోసారి సంబంధిత అధికారులు నీటి నాణ్యత తనిఖీలు చేయాలి. అనంతరం వాటి నివేదికలు ఉన్నతాధికారులకు అందించాలి. నీటినాణ్యతలేని బోర్లుపై రెడ్‌మార్క్‌ చేయాలి. నీటినాణ్యత తనిఖీ విషయంలో పలు శాఖల భాగస్వామ్యం ఉంది. దీంతో ఏ శాఖ అధికారులు కూడా సరైన బాధ్యత తీసుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

తనిఖీలు చేస్తున్నాం

నీటినాణ్యతకు సంబంధించి ప్రభుత్వం అందించిన ఫీల్డ్‌ టెస్టింగ్‌ కిట్లు ద్వారా ప్రతీ ఆరు నెలలకోసారి తనిఖీలు చేస్తున్నాం. సంబంధిత నివేదికలు కూడా సేకరించడం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నాం.

– ఎం.డి.అబాస్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ, సరుబుజ్జిలి

తనిఖీలు చేపట్టాలి



వర్షాలు కురుస్తున్నందున బోర్లలో నీటినాణ్యతను తరచూ తనిఖీ చేయాలి. బోర్లు పనితీరును కూడా పర్యవేక్షించాలి. నీటి నాణ్యతా లోపాలు ఉంటే వాటిని క్లోరినేషన్‌ చేయాలి.

– చల్ల యర్రయ్య, చిగురువలస, సరుబుజ్జిలి మండలం

ట్యాంకులను శుభ్రం చేయాలి



రక్షిత పథకాల నిర్వహణ విషయంలో అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధచూపాలి. ట్యాంకుల్లో పైనుంచి రకరకాల వ్యర్థాలు పడిపోవడం వలన నీరు కలుషితం అవుతోంది. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేయాలి. ట్యాంకుల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలి. ట్యాంకులకు నాచుపట్టకుండా శుభ్రం చేసి పెయింట్‌ వేయాలి.

– పేడాడ వెంకటేష్‌, మూలసవలాపురం, సరుబుజ్జిలి మండలం

ఉపాధి సిబ్బంది అక్రమాలు!

- ఒకే నిర్మాణానికి రెండు సార్లు బిల్లులు
- ఒకసారి లబ్ధిదారు ఖాతాకు నగదు జమ
- రెండోసారి వెండర్‌ ఖాతాకు నగదు జమకు సన్నాహాలు



అగుతుపురంలో నిర్మించిన మినీ గోకులం

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ అగుతుపురం గ్రామానికి చెందిన పాండ్రంకి మల్లేష్‌కు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాన్ని మంజూరు చేసింది. అప్పట్లో దీని నిర్మాణం పూర్తికాకపోవడంతో బిల్లు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత మినీ గోకులం నిర్మాణ పనులు పూర్తిచేయించి 2024–25లో రూ. 85,297 బిల్లు మంజూరుచేశారు. ఈ బిల్లు లబ్ధిదారునికి చెల్లించకుండా ఉపాధి టెక్నికల్‌ అసిస్టెంట్‌ దామోదర్‌, గ్రామస్థాయి ఉపాధి సిబ్బంది భర్త ఖాతాకు జమ చేయించుకున్నారు. 2025–26లో ఇదే పనికి పాండ్రంకి మల్లేష్‌ కుమారుడు బాబూరావు పేరుపై రూ.90,080 బిల్లు ఖాతాకు జనరేట్‌ చేశారు. ఈ బిల్లు త్వరలో లబ్ధిదారుని ఖాతాకు జమ కానుంది. ఇవే కాకుండా ఈ పంచాయతీలో ఉపాధి పథకంలో మరిన్ని అక్రమాలు చోటుచేసుకున్నాయని స్థానికులు, లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి టెక్నికల్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దామోదర్‌పై మండలంలో పలు అభియోగాలు ఉన్నట్లు సమాచారం. గత కొన్ని రోజుల క్రితం తొగిరిలో ఇటువంటి విషయమే ఎంపీడీఓ మోహన్‌కుమార్‌ దృష్టికి వస్తే షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. మండలంలో ఉపాధి సిబ్బంది అక్రమాలు వెలికితీస్తే మరిన్ని బయటపడతాయని పలువురు అంటున్నారు. ఒకపక్క ఉపాధి పథకానికి సంబంధించి సామాజిక తనిఖీలు మండలంలో జరుగుతుండగా.. ప్రస్తుతం ఇటువంటి అక్రమాలు బయటపడుతుండటం విశేషం.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం



టెక్నికల్‌ అసిసెంట్‌ దామోదర్‌పై ఆరోపణలు పలుమార్లు వచ్చాయి. గొర్రిబంద పంచాయతీ అగుతుపురంలో జరిగిన విషయం తన దృష్టికి వచ్చింది. దీనిపై నివేదిక తయారు చేస్తున్నాం. నిబంధనల మేరకు విధుల నుంచి తొలగిస్తాం.

– మోహన్‌ కుమార్‌, ఎంపీడీఓ, సారవకోట

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నరసన్నపేట: మండలంలోని రావులవలస పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఒక రోజు ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రపటానికి హెచ్‌ఎం బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను హెచ్‌ఎం వివరించారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



కె.వెంకటేష్‌, ఎస్‌ఐ

హిరమండలం: హిరమండలం పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐగా కె.వెంకటేష్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ఎండీ యాసిన్‌ను వీఆర్‌కు అటాచ్‌ చేశారు. వీఆర్‌ నుంచి ఎస్‌ఐ వెంకటేష్‌ ఇక్కడకు వచ్చారు. ఎస్‌ఐకు పోలీస్‌ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కన్నబాబుకు పరామర్శ



కన్నబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్‌ కో ఆర్డినేటర్‌, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం కాకినాడ వెళ్లి కన్నబాబును పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు.

అవస్థలు..



ఉధృతంగా ప్రవహిస్తున్న మహేంద్రతనయ నది



రాధాసాగరం ప్రవాహంతో గోకర్ణపురం వెళ్లే రహదారిలో ప్రజల అవస్థలు

మెళియాపుట్టి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. మహేంద్రతనయ నది పొంగి పొర్లడంతో దిగువనున్న పంట పొలాలు నీటమునిగాయి. రాధాసాగరానికి నీటి ప్రవాహం పెరగడంతో గోకర్ణపురం గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాత్రలోవలోని గొడియాల బంద కట్ట కొట్టుకుపోయి కొంతమేర పొలాల్లో బురద చేరింది. రహదారు గోతుల్లో నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.



చెరువును తలపిస్తున్న కుద్దబ రహదారి



వసుంధర వద్ద నీటమునిగిన వరి పంట పొలాలు



పాత్రలోవలోని గొడియాల బంద కట్ట తెగిపోవంతో పొలాల్లోకి వెళ్తున్న నీరు

బాధితులకు పరామర్శ..



బాధితుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామంలో బుధవారం రాత్రి డీటీపీ వర్గీయులు చేసిన దాడిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు పలువురు గాయపడ్డారు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బురద శ్రీనివాస్‌, బురద రాజు, బురద శేఖర్‌, బురద లక్ష్మునాయుడును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌, పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, చింతాడ గోదాకృష్ణ, దుంపల శ్యామలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాడుగు శ్రీనివాసరావు, దానేటి రామ్మోహన్‌, గురుగుబెల్లి అప్పలనాయుడు, బొడ్డేపల్లి మన్మథ, కూటికుప్పల సన్యాసిరావు, తదితరులు ఉన్నారు.

ధర్మాన రామకృష్ణ కుటుంబానికి...



రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణదాస్‌, నాయకులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామానికి చెందిన ధర్మాన రామకృష్ణ తండ్రి రామ్మూర్తి గురువారం మృతి చెందారు. రామకృష్ణ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ గురువారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్‌ నక్క తులసీదాస్‌, సర్పంచ్‌ బాడాన కృష్ణారావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, పొన్నాన హరి ప్రసాద్‌, నిక్కు రాజశేఖర్‌, రావాడ శ్రీనివాసరావు, పంచిరెడ్డి సూర్యనారాయణ, నిక్కు కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

వెయ్యిన్నొక్క దీపాల వినాయకుడు



బూర్జ పంచాయతీ చిన్నకురింపేట గ్రామంలో వినాయక చవితి నవరాత్రులలో భాగంగా గురువారం వేకువ జామున 1001 దీపాలతో గణపతి దీపారాధన చేశారు. ఈ దృశ్యం చూపరులకు కనుల విందు చేసింది.

\- బూర్జ

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

మాజీ రాష్ట్రపతి డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జయంతి పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను డీఈఓ గురువారం ఎంపిక చేశారు. వీరిలో హిరమండలం నుంచి గులుమూరు జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం, ఎంఈఓ–2 ఎస్‌.దాలయ్య, పీడీ సరిపల్లి సుజాత, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్‌ టీచర్‌ టి.రాధిక, అంబావల్లి ఎంపీయూపీ ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, ఆవలంగి ఎంపీపీఎస్‌ ఉపాధ్యాయుడు కె.రాజనారాయణ, కోరాడ జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయిని రెడ్డి ఇందిర, పెద్దకోరాడ ఎంపీపీఎస్‌ ఉపాధ్యాయుడు డి.రమేష్‌, కోరాడ ఎంపీపీఎస్‌ ఉపాధ్యాయిని నూలు దేవి ఉన్నారు. కొత్తూరు మండలం నుంచి కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయిని ఎం.రోజా, దిమిలి ఎంపీపీఎస్‌ నుంచి అంధవరపు రాజేష్‌, పారాపురం ఎంపీపీఎస్‌ నుంచి పతివాడ రమేష్‌, జలుమూరు మండలంలోని రామకృష్ణాపురం ఉన్నత పాఠశాల ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడు మజ్జి కృష్ణారావు, మెళియాపుట్టి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయుడు (జీవశాస్త్రం) దండుగుల శ్రీనివాసరావు, పోలాకి మండలంలోని కోడూరు జెడ్పీహెచ్‌ఎస్‌ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బాడాన రాజు, పాతపట్నం మండలంలోని పెద్దలోగిడి ఎంపీపీఎస్‌కు చెందిన పారశెల్లి ప్రభాకరరావు, తామరలోని మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాలకు చెందిన చెన్నబొయిన దుర్గారావు, బూర్జ మండలంలోని తిమడాం ఎంపీపీఎస్‌ హెచ్‌ఎం జి.ప్రవీణ్‌ కుమార్‌, లక్కుపురం ఎంపీపీఎస్‌ ఉపాధ్యాయుడు జల్లు కాశీవిశ్వేశ్వరరావు, సారవకోట మండలంలోని చిన్నకిట్టలపాడు జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం అగతముడి రమేష్‌ ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం జిల్లా కేంద్రంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌

15న తలనీలాల వేలం పాట

పాతపట్నం: ఈ నెల 15వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో తలనీలాలను వేలయం వేయనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జూలై 5వ తేదీ నుంచి 2025 సెప్టెంబర్‌ 14వ తేదీ వరకు గల తలనీలాలను వేలం వేస్తామన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు ఆలయంలోని ఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

కొత్తూరు: కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సులు వేయడంతో ఉపాధి లేకుండా పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. కొత్తూరులో గురువారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో డ్రైవర్ల సంక్షేమ కోసం ఎన్నో హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలయ్యారని విమర్శించారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోకపోతే భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధంగా ఉంటామన్నారు. పోరాటాలకు డ్రైవర్లు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సురేష్‌, తవుడు, రామారావు, నరేష్‌, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి మృతికి సంతాపం



హరనాథరావు (ఫైల్‌)

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌కు చెందిన ప్రముఖ పండ్ల వ్యాపారి పొట్నూరు హరనాథరావు (హరి) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. హరి మృతి పట్ల మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట సర్పంచ్‌ బూరల్లి శంకర్‌, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మంచి ఆత్మీయుడిని కోల్పోయామని ధర్మాన సోదరులు అన్నారు. హరికి ముగ్గురు కుమారులున్నారు. వీరందరూ వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు.